క్లుప్తంగా

నేతకానీలను గ్రూప్ సీలో చేర్చాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చెన్నూర్: ఎస్సీ వర్గీకణలో గ్రూప్ 1 2 3 కాకుండా ఏబీసీడీలుగా ఏర్పాటు చేసి, నేతకాని మహార్‌లను గ్రూప్ సీ లో చేర్చుతూ మాల, మరికొన్ని అభివృద్ధి చెందిన కులాలను డీ గ్రూప్‌లో చేర్చాలని ఎస్సీ వర్గీకరణ కమిషనర్ డాక్టర్ షమీమ్ అక్తర్‌కు నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి యువరాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ నివేదికలో మాలసాలె, నేతకానీలను గ్రూప్–3 లో చేర్చారని తెలంగాణ రాష్ట్రంలో మాలసాలె లేదన్నారు. నేతకాని మహార్‌లతో పాటు మరిన్ని కులాలను కల్పి గ్రూప్‌లో సీలో ఉంచాలని కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో నేతకాని యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, నాయకులు మల్లేశ్, ప్రభుదాస్, ప్రేమ్‌కుమార్ పాల్గొనారు.

సేవాలాల్ జయంతి



పూజలు చేస్తున్న బంజారా నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సంజీవయ్యకాలనీలోని రజక సంఘం భవనంలో బంజారా నాయకులు సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించారు. భోగ్ బండార్ నిర్వహించి సేవాలాల్‌కు దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో పూజారి ధూపానాయక్, మంచి మంచిర్యాల తండావాసులు అజ్మీర రాజునాయక్, గుగ్లోత్ ఇందల్, తేజావత్ రాంబాబు, హేమ్లా నాయక్, పురుషోత్తం నాయక్, లాకవత్ రాజునాయక్ పాల్గొన్నారు.

బర్డ్ ఫెస్టివల్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఫారెస్టు రేంజి అధికారి సుభాష్ ఆధ్వర్యంలో శుక్రవారం బర్డ్ ఫెస్టివల్ నిర్వహించారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామ శివారులోని చెరువు వద్ద విద్యార్థులకు పక్షులను చూపించారు. పక్షుల పేర్లు, వాటి నడక, వాటి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో సత్తయ్య, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ నస్పూర్ ఏఈ మల్లేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా, ఈ అంతరాయం ఏర్పడునని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీడ్కోలు సందడి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వాగేశ్వరి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మణ్, డైరెక్టర్లు శ్రీధర్, మహేందర్, సాగర్, శ్రీనివాస్, నరేష్, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డు లైబ్రేరియన్‌కు సత్కారం

తాండూర్: ఉద్యోగ విరమణ పొందిన తాండూర్ లైబ్రేరియన్ గజ్జెల రమేశ్‌ను లైబ్రరీ ఆవరణలో శుక్రవారం గ్రంథాలయ పాఠకులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.మహేందర్ రావు ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, ఎంపీడీవో శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై రమేష్ దంపతులకు పూలమాల వేసి శాలువా కప్పి సత్కారం చేశారు.

రిటైర్డు టీచర్‌కు...

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ మండల పరిషత్ పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఇందూరి ఆశాలును శుక్రవారం మండల మానవ వనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం సన్మానించారు. కార్యక్రమంలో బారేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు బోయపల్లి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. మొక్కలకు శాపం



భీమిని: ప్రభుత్వ ఆదేశాలతో ప్రధాన రహదారులతోపాటు పల్లెరోడ్లకు అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా రూ.లక్షలు వెచ్చించి మొక్కలు నాటారు. అధికారుల నిర్వహణ లోపంతో కొన్ని కనిపించకపోగా, మరికొన్ని మంటల్లో కాలిపోతున్నాయి. కన్నెపల్లి మండలంలో ప్రధాన రహదారికి ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతవుతున్నాయి. మొక్కలు ఉన్నచోట నిర్వహణ లేదు. ఎదిగిన మొక్కల చుట్టూ పిచ్చిగడ్డి, ముళ్లపొదలు పెరిగి కానరాకుండా పోతున్నాయి. ఉపాధి హామీ పథకంలోనైనా కూలీలతో అవెన్యూ ప్లాంటేషన్ చుట్టూ పెరిగిన పిచ్చిగడ్డి, ముళ్లపొదలు తొలగింపు పనులు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొక్కలు కాలిపోవడానికి కారకులైన వారిపై అధికారులు చర్యలు తీసుకుని జరిమానా విధించి, మొక్కలను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

మరుగుదొడ్డి నిరుపయోగం..!



భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతంలో నిర్మించిన మరుగుదొడ్లను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. రాజీవ్ విద్యామిషన్ ద్వారా మరో మరుగుదొడ్డి నిర్మించినప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 250మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వం స్పందించి నిరుపయోగంగా ఉన్న వాటికి మరమ్మతు చేసి ఉపయోగంలోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

జోరుగా అక్రమ తవ్వకాలు!



కాసిపేట: మండలంలో ఇసుక, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టడంతో వాగులు, వంకలు ఎడారిని తలపిస్తున్నాయి. పెద్దనపల్లి శివారులో గల కొంతభూమి కేకే ఓపెన్‌కాస్టులో ముంపునకు గురవుతుండడంతో సింగరేణి యాజమాన్యం సేకరించి భూమి యజమానులకు నష్టపరిహారం చెల్లించింది. దీంతో సంబంధిత యజమానులు భూమిని సింగరేణికి అప్పగించారు. ఆ భూమిలో అక్రమంగా కొందరు ట్రాక్టర్ యజమానులు మట్టి, ఇసుకను తోడుతుండడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయమై పోలీసుల దృష్టికి తీసుకెళ్తే.. ఒకటి రెండు రోజులు తవ్వకాలు నిలిపివేసి మళ్లీ తవ్వకాలు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతున్నారు.

విస్తరణకు అడ్డంకులు!



తిలక్‌నగర్ వద్ద నిలిచిన రోడ్డు వెడల్పు పనులు

- 'మంచిర్యాల' మాస్టర్ ప్లాన్ అమలయ్యేనా..?
- కార్పొరేషన్ ఏర్పాటుతో పెరగనున్న ట్రాఫిక్
- రోడ్డు పనులకు అడ్డుగా వివాదాలు
- పరిష్కారంలో విఫలమవుతున్న అధికార యంత్రాంగం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చడంతో పట్టణం వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడింది. మంచిర్యాల మున్సిపాలిటీగా ఉన్న సమయంలో మొదటిసారిగా 1972లో మాస్టర్‌ప్లాన్ ఏర్పాటు చేశారు. దీని ఆధారంగానే ప్రధాన రహదారులకు అంతర్గత రోడ్లను కలుపుతూ ప్రణాళిక రూపొందించారు. భవిష్యత్తు అవసరాల మేరకు బైపాస్ రోడ్ల నిర్మాణం కోసం మాస్టర్ ప్లాన్‌లో స్థలాలను కేటాయించారు. 2012లో తిరిగి మరోసారి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి, రోడ్ల నిర్మాణ నమూనాను ఏర్పాటు చేశారు. పాత, కొత్త మాస్టర్ ప్లాన్‌ల ప్రకారం మంచిర్యాల పట్టణం చుట్టూ విశాలమైన రోడ్లు ఉండేలా రూట్‌మ్యాప్‌ను ఏర్పాటు చేశారు. మంచిర్యాల గోదావరిఖని ప్రధాన రహదారిని ఆనుకొని చున్నంబట్టి వాడ, శ్రీశ్రీనగర్ మీదుగా తిలక్‌నగర్, హమాలీవాడ, రాముని చెరువు మీదుగా మంచిర్యాల, బెల్లంపల్లి ప్రధాన రహదారి లక్ష్మీ టాకీస్ చౌరస్తా వరకు 100ఫీట్ల బైపాస్ రోడ్డు నిర్మించేందుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. పాతమంచిర్యాల నుంచి రంగంపేట్ మీదుగా ఆండాళమ్మ కాలనీ వరకు వందఫీట్ల రోడ్డు ఏర్పాటును చేశారు. దీంతో పాటు పట్టణంలోని వైశ్యభవన్ సమీపంలో బైపాస్ రోడ్డు నుంచి వైశ్యభవన్ పక్క నుంచి 80ఫీట్ల రోడ్డును వేసేలా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించినా, ఇప్పటికీ రోడ్డు పనులను చేపట్టలేదు.

మాస్టర్‌ప్లాన్ అమలుకు చర్యలు



మంచిర్యాల కార్పొరేషన్‌గా మారింది. అభివృద్ధి పరంగా తీసుకునే చర్యల్లో మాస్టర్ ప్లాన్‌ను అమలయ్యేలా చూస్తాం. కొత్తగా చేరిన నస్పూర్ మున్సిపాలిటీతో పాటు, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను కలుపుకొని పట్టణ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను చేస్తాం. గతంలో కేటాయించినట్లుగానే రోడ్లను వెడల్పు చేస్తాం.

– శివాజీ, మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్

మాస్టర్‌ప్లాన్ అమలైతేనే..

మంచిర్యాల పట్టణం శరవేగంగా విస్తరిస్తుండడంతో పాటు, ఇటీవల నస్పూర్ మున్సిపాలిటీని, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను కలిపి మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. పట్టణ అభివృద్ధికి కార్పొరేషన్‌గా మారడం కూడా దోహదం కానుంది. ప్రస్తుతం ఉన్న రోడ్ల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో, స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చొరవతో మంచిర్యాల మార్కెట్‌లోని రోడ్లు మాస్టర్ ప్లాన్ ప్రకారం 60ఫీట్లకు ఏర్పాటు చేస్తున్నారు. ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు రోడ్డు వెడల్పు 132ఫీట్లు ఉండేలా మార్కింగ్ చేస్తున్నారు. కానీ బైపాస్ కోసం ఏర్పాటు చేసిన రోడ్ల వెడల్పు పనులను చేపట్టకపోవడంతో, ఆయా రోడ్లు కబ్జాకు గురవుతున్నాయి. ఇప్పటికే లక్ష్మీ టాకీస్ చౌరస్తా నుంచి చున్నంబట్టి వరకు 100ఫీట్ల రోడ్డుకు ఏదో ఒక అడ్డంకి ఏర్పడుతూనే ఉంది. మాస్టర్ ప్లాన్‌ను 2012లో రూపొందించిన అనంతరం అందుకు తగినట్లుగా రోడ్ల వెడల్పు పనులను చేపట్టకపోవడంతో వంద ఫీట్లు ఉండాల్సిన రోడ్డు కొన్నిచోట్ల 60ఫీట్లకు కుదించుకుపోయింది. ఇప్పటికీ శ్రీశ్రీనగర్ ఏరియాలో 100ఫీట్ల రోడ్డును కొందరు కబ్జా చేయడంతో వందఫీట్లకు దీనిని మార్చేందుకు ఇబ్బందిగా మారింది. దీంతోపాటు, లక్ష్మీటాకీస్ చౌరస్తా నుంచి హమాలీవాడ వరకు వెళ్లే వంద ఫీట్ల రహదారి హైటెక్ సిటీ కాలనీ మీదుగా పోతుండగా, ఆ భూమి ఎంసీసీ కంపెనీకి చెందిందని వారు కోర్టుకు వెళ్లడంతో రోడ్డు పనులకు బ్రేక్ పడినట్లయ్యింది. మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి, దాని ప్రకారంగా ముందుగానే రోడ్లను ఏర్పాటు చేసి ఉంటే, ప్రస్తుతం ఇబ్బందులు ఉండేవి కావు. మంచిర్యాల కార్పొరేషన్‌గా మారడంతో, గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పైనే అందరి దృష్టి ఉంది. రోడ్ల వెడల్పు తప్పనిసరి కావడంతో, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి, వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటేనే మాస్టర్‌ప్లాన్ వందశాతం అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది. పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో, భవిష్యత్తులో వెడల్పుగా ఉండే రోడ్లతో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టడంతో పాటు, పట్టణంలోకి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. విద్య, వైద్యానికి హబ్‌గా మారుతున్న మంచిర్యాల పట్టణానికి ట్రాఫిక్ తాకిడి పెరిగే అవకాశాలు భవిష్యత్‌లో ఎక్కువగా ఉండగా, ఇప్పటికైనా మాస్టర్‌ప్లాన్ ప్రకారంగా రోడ్లకు మార్కింగ్ చేసి, రోడ్డుకు ఇరువైపులా కందకాలను తవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ఘనంగా సైన్స్ దినోత్సవం



బెల్లంపల్లి: ప్రయోగాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



దండేపల్లి: వెల్గనూర్‌లో ప్రయోగ ప్రదర్శన



చెన్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోటపల్లి/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలఅర్బన్/జన్నారం/బెల్లంపల్లి/నస్పూర్/మందమర్రిరూరల్: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల ప్రాజెక్ట్ వర్క్‌లను సొంతంగా తయారు చేసి ప్రదర్శనగా ఉంచారు. వాటి పనితీరును తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు వివరిస్తూ అందరితో ప్రశంసలు పొందారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పిల్లల మనోవికాసానికి సైన్స్ ఫెయిర్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని సైన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. సైన్స్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సీవీ రామన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో కోటపల్లిలో ఎస్‌వో హరిత, మోడల్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు సురేందర్, సంపత్, ధనరాజు, పొక్కూర్‌లో హెచ్‌ఎం దత్త కుమార్, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చక్రపాణి, ఎన్‌సీసీ కేర్ టేకర్ మహేష్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు కుమారస్వామి, రాజయ్య, జన్నారంలో ఉపాధ్యాయులు రామటెంకి శ్రీనివాస్, లక్ష్మయ్య, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వనిత, బెల్లంపల్లిలో మండల విద్యాశాఖ అధికారి పోచన్న, మందమర్రిలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారా తస్నీమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కసూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సైన్స్ దినోత్సవం



జన్నారం: సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు


మందమర్రి ఏరియాలో 95శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఫిబ్రవరి మాసంలో 95శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. జీఎం ఆఫీస్ ఆవరణ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కేకే-5 భూగర్భ గనిలో 17,528 టన్నులు(110శాతం), కాసిపేట గనిలో 12,009 టన్నులు(63శాతం), కాసిపేట-2 గనిలో 11,952 టన్నులు (75శాతం), శాంతిఖని గనిలో 2,799టన్నులు (23శాతం), కేకే-ఓసీలో 113,162 టన్నులు (71 శాతం) మొత్తం 2,08,984టన్నుల (95శాతం) బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు వివరించారు. ఆర్కే ఓసీలో ఎలాంటి బొగ్గు ఉత్పత్తి జరగలేదన్నారు. ఆర్కే ఓసీ తిరిగి ప్రారంభించడానికి కనీసం అనుమతుల కోసం యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇంకా నెల రోజులు మాత్రమే ఉందని, ఏరియాలోని ఉద్యోగులంతా సమష్టిగా కృషిచేసి యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్వోటు జీఎం విజయప్రసాద్, ఐఈడీ రాజన్న, సివిల్ ఎస్ఈ రాము, ఇన్‌చార్జి పర్సనల్ మేనేజర్ మైత్రేయబంధు, డీవైపీఎం ఆసీఫ్ ఉన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ చౌదరి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందించాలని సమగ్రశిక్ష కో–ఆర్డినేటర్ చౌదరి అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో 2024 డీఎస్సీ సెకండరీగ్రేడ్ టీచర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిబద్ధత, సమయపాలన పాటిస్తూ ఎఫ్‌ఎల్‌ఎన్, యుడైస్ ప్లస్, మధ్యాహ్న భోజనం మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. బోధనలో మెలకువలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు యశోధర, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, ఏఎస్‌సీ రాజ్‌కుమార్, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి, డీఆర్పీలు, టీచర్లు పాల్గొన్నారు.

రిటైర్డు కార్మికులకు సన్మానం



శ్రీరాంపూర్: సురేశ్‌ను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్



బెల్లంపల్లి: సన్మానం పొందిన కార్మికులు



జైపూర్: సుధాకర్‌ను సన్మానిస్తున్న ఎస్టీపీపీ అధికారులు



కాసిపేట గనిపై రాజన్న దంపతులను సన్మానిస్తూ...

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులు, డిపార్టుమెంట్‌లలో సర్వీసు పూర్తిగా చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలో రిటైర్డ్ అయిన బాజిరెడ్డి సురేశ్(స్వీపర్)ను జీఎం శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపాలని ఆకాంక్షించారు. ఆర్కే 6 గనిలో రిటైర్డ్ అయిన ఎండపల్లి ముత్యం (ట్రామర్), డీ రాజయ్య(జనరల్ మజ్దూర్), ములకల్ల అప్పయ్య(హాలేజీ ఆపరేటర్), పానుగంటి రాయలింగు(జనరల్ మజ్దూర్)లను గని మేనేజర్ ఈ తిరుపతి శాలువాతో సత్కరించారు. కార్యక్రమాల్లో ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, ఆర్కే–6 గని రక్షణాధికారి శ్రీనివాస్, డెప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, పిట్ ఇంజనీర్ అందె శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పంపు ఆపరేటర్ పుప్పిరెడ్డి మల్లయ్య, ఫ్యాన్ ఆపరేటర్ దుర్గం దుర్గయ్యలకు గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పూలమాల వేసి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఏఐటీయూసీ నాయకులు, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు డీజీఎం(ఫైనాన్స్) విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందుతున్న టి.సుధాకర్‌కు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు ఆయనను శాలువాలతో సన్మానించి బహుమతులతో సత్కరించారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఉద్యోగ విరమణ పొందిన టీబీజీకేఎస్ నాయకులు ఒడ్నాల రాజన్న దంపతులను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గని మేనేజర్ భూ శంకరయ్య, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



థామస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్స్

రామకృష్ణాపూర్/తాండూర్: టైలర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో, తాండూర్‌లో కుట్టు మిషన్ కనిపెట్టిన సెయింట్ థామస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాండూర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దర్జీలను సన్మానించారు. టైలర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఆర్కేపీలో టైలర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు పాల్ రాజు, నారాయణ, హుస్సేన్, రంజిత్‌కుమార్, తాండూర్‌లో వాసవీ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సంతోష్‌కుమార్, వాసవీ క్లబ్ తాండూర్ మండల అధ్యక్షుడు మధుసూదన్, మాజీ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్‌పై అవగాహన



డ్రోన్ ద్వారా పిచికారీ చేయిస్తున్న ఏడీఏ

భీమారం: మండలంలోని కాజిపల్లిలో వరి, మామిడి సాగు చేస్తున్న రైతులకు డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందుల స్ప్రే చేసే పద్ధతులపై శుక్రవారం వ్యవసాయశాఖ చెన్నూరు ఏడీఏ ప్రసాద్ అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా పంటలకు స్ప్రే చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే ఆర్థికంగా ముందడుగు వేయొచ్చన్నారు. అనంతరం రైతుల పంట పొలాలకు కాండం తొలుచు పురుగు నివారణ కోసం డ్రోన్‌ద్వారా క్రిమి సంహారక మందులను స్ప్రే చేయించారు. ఏవో సుధాకర్, రైతులు పాల్గొన్నారు.